## భాష్యంలో స్పోర్ట్స్ మీట్



అల్వాల్: అల్వాల్ భాష్యం స్కూల్‌లో సోమవారం స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్కూల్ సీఈవో చైతన్య, జెడ్‌ఈవో మార్కండేయులు హాజరై ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ బాల్యం నుంచే ఉత్తమ లక్ష్యాలను అలవర్చుకోవాలన్నారు. ప్రిన్సిపల్ అమూల్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వినతి



కుషాయిగూడ: కాప్రాలోని ప్రభుత్వ స్థలంలో సామాజిక భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం కాప్రా డివిజన్‌కు చెందిన గోగికార్ శివకుమార్ శ్రావణ్‌కుమార్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్–510లోని 22 గుంటల ప్రభుత్వ స్థలంలో బీసీ, ఎస్సీ సామాజిక భవనాల నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



మల్లాపూర్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎస్‌ఐలు కుమారస్వామి, వెంకటయ్య అన్నారు. మల్లాపూర్ మోడ్రన్ హైస్కూల్ స్పోర్ట్స్ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశయంతో చేసే పని సక్సెస్ అవుతుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు, ముఖ్యంగా సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. మోడ్రన్ హైస్కూల్ చైర్మన్ మత్యుంరెడ్డి, పీఈటీ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా మౌలిక వసతులు



బోడుప్పల్: 18వ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ పులకండ్ల హేమలతారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో దశలవారీగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. తీర్మానం అయి పెండింగ్ ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పులకండ్ల జంగారెడ్డి, రవికాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేస్తాం



ఉప్పల్: లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని లయన్ కృష్ణ ప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ అంతర్జాతీయ శిక్షణ కేంద్ర కార్యాలయం చికాగోలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్స్ శిక్షణను ముగించుకుని నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజాభివృద్ధి, నిరుపేదలను ఆదుకోవడంలో లయన్స్ క్లబ్ గురుతరమైన బాధ్యతను స్వీకరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సేవ గురించి శిక్షణ కేంద్రంలో ఎంతో నేర్చుకున్నామన్నారు. శిక్షణ ముగించుకుని నగరానికి వచ్చిన కృష్ణ ప్రసాద్ బృందాన్ని పలువురు ప్రశంసించారు.

## పవర్ లిఫ్టింగ్‌లో ప్రణయ్‌కి 3 స్వర్ణాలు



ఉప్పల్: పవర్ లిఫ్టింగ్ ఏషియన్ పోటీల్లో యువ లిఫ్టర్ జొన్నపల్లి ప్రణయ్ రాజు మూడు స్వర్ణాలు కైవసం చేసుకుని సత్తా చాటాడు. ప్రపంచ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి 10 తేదీ వరకు కిర్గిజిస్తాన్ దేశ రాజధాని బిష్కెక్ నగరంలో పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఇందులో ఉప్పల్‌కు చెందిన ప్రణయ్ పాల్గొన్నాడు. అండర్–19 విభాగం డెడ్ లిఫ్టింగ్‌లో 135 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 65 కిలోలు, స్క్వాట్‌లో 82 కిలోలు మొత్తం 282.5 కిలోల బరువు ఎత్తి మూడు స్వర్ణాలు గెలుపొందారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఇంటూరి రేఖ పర్యవేక్షణలో నగర శివారులోని కొల్లూరులోని వీటీడీ ఫిట్నెస్ సొల్యూషన్స్ జిమ్‌లో ఈ పోటీల కోసం ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

## నేరెడ్‌మెట్‌లో వెస్పా షోరూమ్ ప్రారంభం





అల్వాల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు అన్నారు. సోమవారం నేరెడ్‌మెట్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన నూతన వెస్పా షోరూమ్‌ను వారు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మీనఉపేందర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, స్థానిక నాయకులు, నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ నీరు అందించడమే లక్ష్యం



మల్లాపూర్: ప్రతి ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యమని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. గ్రీన్‌హిల్స్ కాలనీ ఫేజ్–2లో సోమవారం నీటి కనెక్షన్ ప్రారంభించారు.

# బస్తీ దవాఖానాల్లో నాణ్యమైన వైద్యం



ఈసీనగర్‌లో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు



ఉప్పల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కార్పొరేటర్లు, తహసీల్దార్

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

కుషాయిగూడ: పేదలకు నాణ్యమైన వైద్య సాయం అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ ఈసీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను సోమవారం స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా బస్తీ దవాఖానాల్లో సదుపాయాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు బస్తీ దవాఖానాల్లో ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను డాక్టర్లు, సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించి ప్రజల్లో విశ్వాసం కలిగించాలన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందన్నారు. రూ.5 లక్షల ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రఘునందన్, డాక్టర్ వినయ్, డాక్టర్ జోహన్నాతో పాటుగా స్థానిక నేతలు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలను ఉపయోగించుకోవాలి

ఉప్పల్: కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ నిరుపేదలకు వరమని ఉప్పల ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమవేశంలో తహసీల్దార్ వాణిరెడ్డి, కార్పొరేటర్లతో కలిసి పంపిణీ చేశారు. రూ.1,34,15,544లను నగదును 134 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి ఏ కష్టం వచ్చినా అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజెన్ శేఖర్ పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.1.14 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. నాచారం వార్డు కార్యాలయం అదనపు అంతస్తుల కోసం రూ.54 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులు, రూ.50 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ, రాఘవేంద్రనగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జలమండలి జీఎం సంతోష్, డీజీఎం సతీష్, ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ లింగారావు తదితరులు పాల్గొన్నారు.



నాచారంలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతిసాయిజెన్

# సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



మచ్చబొల్లారంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లో సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సీసీ రోడ్డు, తాగునీరు, డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, వీధి దీపాలు తదితర సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం భాస్కర్, మేనేజర్ మల్లికార్జున్, ఇంజినీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, కాలనీవాసులు అశ్విన్, నిఖిల్, సన్నీ, ప్రమోద్, సంజీవ, మహేశ్వరి, అరుణ్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్‌యాదవ్, పరమేష్, శోభన్, సందీప్, వెంకట్, మల్లేష్‌యాదవ్, సతీష్, రమేష్ చారి, హనుమాన్‌చారి, నామ్‌దేవ్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

మల్లాపూర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్ అన్నారు. నాచారం నుంచి ఏఎస్‌రావు నగర్ వరకు వెయ్యి మందితో ఈటల రాజేందర్ గెలుపు కోసం మద్దతుగా బీజేపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీలో ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బైక్‌ర్యాలీలో బీజేపీ నేతలు పద్మారెడ్డి, రవినాయక్, శ్రీనివాస్, పోతగాని గోపాల్‌గౌడ్, రాంప్రదీప్, గౌరిగే కృష్ణ, గద్దం సాయి తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో ఈటల రాజేందర్, ఎన్వీఎస్ఎస్

# మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 15వ డివిజన్‌లో రూ.54 లక్షల వ్యయంతో లక్ష్మారెడ్డి కాలనీమీదగా టెలిఫోన్ కాలనీ ప్రధాన రహదారిని కలుపుతూ వేసే సీసీరోడ్డు పనులను, అలాగే 3వ డివిజన్‌లో చెంగిచర్ల ప్రధాన రహదారిలో రూ.9 లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుధ్యంకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. గతంలో తీర్మానం చేసి పెండింగ్ ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, సీనియర్ నాయకులు కొత్త రవిగౌడ్, కొత్త కిశోర్‌గౌడ్, సిగురు రేణుక రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

# అన్ని రంగాల్లో సేవలందిస్తున్న మహిళలు



ఉప్పల్ కార్పొరేటర్ రజితను సన్మానిస్తున్న మహిళా సంఘం నేతలు



అరోరా అటనామస్ కళాశాలలో..

**ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి**

ఉప్పల్: అన్ని రంగాల్లో మహిళలు విలువైన సేవలను అందిస్తున్నారని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో స్థానిక మహిళలు కార్పొరేటర్‌ను ఆహ్వానించి సన్మానించారు. సాయిరాంకాలనీరెడ్డి మహిళా సమైఖ్య, ఉప్పల్ లక్ష్మీనారాయణ కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోవాలని, ప్రతి పనిలో తమ చాతుర్యాన్ని కనబర్చాలని సూచించారు. సునీత, సువర్ణ, ప్రమోద, రామ, ప్రేమలత, మమత, ఉమారాణి, అనిత రాణి పాల్గొన్నారు.

**మహిళాభివృద్ధితోనే దేశ పురోగతి**

రామంతాపూర్: అరోరా అటనామస్ కళాశాలలో సోమవారం అన్విత ఉమెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా మహిళా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.మాధవి బహుమతులు అందజేశారు. ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సతీష్‌కుమార్, దేవేంద్రరావు పాల్గొన్నారు.

**వనిత సేవా సంఘం ఆధ్వర్యంలో..**

రామంతాపూర్: వనిత సేవా సంఘం ఆధ్వర్యంలో రామంతాపూర్‌లో సోమవారం నిర్వహించిన మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు హాజరయ్యారు. సేవా సంఘం అధ్యక్షురాలు ఆకుల సుభాషిణి, రాష్ట్ర మహిళా గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బీనేపల్లి స్వరూపరాణి, అనిల్‌కుమార్, మహేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు



బోడుప్పల్: చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి హాజరై విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా చదువుతూ ముందుకెళ్తే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు మంచి పొజిషన్‌లో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో ఒత్తిడి, భయానికి లోనుకాకుండా ధైర్యంగా ఉండి, ఆలోశించి పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థుల చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ నీలిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి వలసలు

కాప్రా: రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొత్త అంజిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. జమ్మిగడ్డలో జరిగిన కార్యక్రమంలో బీజేఆర్ కాలనీ, జైజవాన్‌కాలనీ, విరాట్‌నగర్, జీఆర్‌రెడ్డినగర్, భవానీనగర్‌కు చెందిన వారికి పరమేశ్వర్‌రెడ్డి, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఎన్నికల హామీలను అమలుచేస్తూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఇచ్చిన మాటకు కట్టుబడి ముందుకు సాగుతున్న సీఎంపై విశ్వాసంతోనే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. కాంగ్రెస్ నాయకులు రాఘవరెడ్డి, సీతారాంరెడ్డి, అల్లూరయ్య, రాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగరాజు, బాల్‌రాజు, శ్రీనివాసు, గద్దం ప్రసాద్, భవానీ పాల్గొన్నారు.



పరమేశ్వర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఏఎస్‌రావునగర్ బీఆర్ఎస్ నాయకులు

## ప్రజావాణి సమస్యలను పరిష్కరిస్తాం



అల్వాల్: ప్రజావాణిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని అల్వాల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అల్వాల్ సర్కిల్ రామేశ్వర్‌నగర్‌లోని పార్కు పక్క ఉన్న రోడ్డును ఆక్రమించి కట్టిన రోడ్డును తీసివేయాలని కాలనీవాసులు డిప్యూటీ కమిషనర్‌కు ప్రజావాణిలో విన్నవించారు. కార్యక్రమంలో వీరయ్య, మురళీధర్‌చారి, సురేందర్‌రెడ్డి, సతీష్, నాగేష్ పాల్గొన్నారు.

## బిల్లులు చెల్లించడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

మల్కాజిగిరి: అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదని కాంట్రాక్టర్లు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ అసోషియేషన్ అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రిటర్నింగ్ అధికారితో పాటు సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పోలింగ్ స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఏర్పాట్లు చేశామన్నారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు సుమారు రూ.61 లక్షలు రావాల్సి ఉందన్నారు. ఎన్నికల బిల్లులకు సంబంధించి నిధులు కలెక్టర్ కార్యాలయం నుంచి మంజూరైనా రిటర్నింగ్ అధికారి ఇవ్వడం లేదని, ఈ విషయాన్ని ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేశామన్నారు.

## వాహనాలను తీసుకెళ్లండి

మల్కాజిగిరి: మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న గుర్తు తెలియని వాహనాలను సంబంధిత యజమానులు తీసుకెళ్లాలని ఇన్‌స్పెక్టర్ శివశంకర్ సూచించారు. సుమారు 31 వాహనాలను యజమానులు వాటి పత్రాలను అందజేసి వాహనాలను తీసుకెళ్లాలని, ఇతర వివరాలకు ఫోన్: 87126 62463.

## బ్రాహ్మణ సంఘాల మద్దతుతో మల్కాజిగిరిలో పోటీ






బ్రాహ్మణ శంఖారావం సభలో అభివాదం చేస్తున్న వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు

**శంఖారావం సభలో వైష్ణవి ప్రసాద్**

నాగోలు: అన్ని వర్గాల ప్రజలకు మరింత సేవ చేసేందుకు.. బ్రాహ్మణ సంఘాల మద్దతుతో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వైష్ణవి ప్రసాద్ తెలిపారు. ఆదివారం రాత్రి నాగోలులోని అనంతుల అంజిరెడ్డి గార్డెన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం, బ్రాహ్మణ శంఖారావం సభ నిర్వహించారు. మల్కాజిగిరి పరిధిలోని అన్ని నియోజకవర్గాల బ్రాహ్మణ సంఘాలు వైష్ణవి ప్రసాద్‌కు మద్దతు ఇవ్వాలని తీర్మానం చేసి సంఘీభావం ప్రకటించాయి. సమావేశానికి భాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ అధ్యక్షుడు దుడ్డు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన శంఖారావ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైష్ణవి ప్రసాద్ మాట్లాడుతూ తాను కొన్నేళ్లుగా నగరంలో విద్య, వైద్య రంగాల్లో సేవలందిచానని తెలిపారు. గెలిపిస్తే మల్కాజిగిరి ప్రజలకు సేవలందిస్తానన్నారు. తనకు మద్దతు తెలిపినందుకు బ్రాహ్మణ సంఘాల వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 10 మంది సభ్యులతో కమిటీ వేసి తన ఆఫీస్‌ని ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. వివిధ బ్రాహ్మణ సంఘాల అధ్యక్షులు మంగపతి రావు, దర్శనం శర్మ, తులసి శ్రీనివాస్, టీబీఎస్ఎస్ఎస్ నాయకులు జగన్మోహన్ శర్మ, బసవరాజు శ్రీనివాస్, ఎంవీఆర్ శాస్త్రి, నందిరాజు లక్ష్మీనారాయణ, వెంట్రాప్రగడ సుబ్బారావు, వక్కలంక శ్రీనివాస్‌రావు, మునిపల్లె శ్రీనివాస్, గొల్లపూడి రాజేశ్వరరావు, సోమయాజులు, మూర్తి, కల్పవల్లి, అనురాధ, భవాని, శ్రీదేవి, వివిధ సంఘాల కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు బ్రాహ్మణులు పాల్గొన్నారు.

## మోదీతోనే దేశంలో ప్రశాంతత



మల్కాజిగిరి: మోదీ తోనే దేశంలో ప్రశాంతత సాధ్యమైందని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. బృందావన్ గార్డెన్‌లో సోమవారం రాత్రి జాతీయ కళాకారుల వేదిక ఆధ్వర్యంలో జరిగిన స్వరరాగ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు మానవ జీవితం కుటుంబంగా ఉండేదన్నారు. ప్రస్తుతం ఇద్దరు ముగ్గురికి కుటుంబం పరిమితమైందన్నారు. పిల్లలు కూడా తల్లిదండ్రులు గురువుల మాటలు వినే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో డ్రగ్స్ రాజ్యం ఉందన్నారు. గతంలో మన దేశంపై దాడులు జరిగినప్పుడు సంస్కృతి సంప్రదాయాలను కోల్పోయామని, వాటిని తిరిగి మోడీ హయాంలో సాధించామన్నారు. అందుకు నిదర్శనం అయోధ్య రామమందిరం నిర్మాణమేనన్నారు. అమెరికా వంటి దేశాలు మన దేశ ప్రధానిని చిన్నచూపు చూశాయని, ప్రస్తుతం ఆ దేశాలు రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకుతున్నాయన్నారు. ప్రజల నమ్మకాన్ని విశ్వాసాన్ని పొందిన మోదీ మరోమారు ప్రధాన మంత్రి కావాలంటే ప్రజలు బీజేపీని గెలిపించాలన్నారు. ప్రముఖ కళాకారులైన డీవీ మోహన్ కృష్ణ వినోద్ బాబు తదితరులను ఆయన సన్మానించారు కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రవణ్, సునీత యాదవ్, నిర్వాహకులు చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.